వైభవంగా సువర్ణ పుష్పార్చన

స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 29: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో బుధవారం సువర్ణపుష్పార్చన నిర్వహించారు. ఆర్జిత పూజల్లో భాగంగా ప్రధానాలయ ముఖ మండపంలో సువర్ణమూర్తులకు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా సువర్ణ పుష్పార్చన పూజలు నిర్వహించారు. బంగారు పుష్పాలతో దేవేరులను అర్చించారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. స్వామివారి సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం స్వామివారికి దర్బార్ సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామివారిని 26 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 36,35,451 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారి సేవలో మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

ఆలయ మాడవీధుల్లో మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని బుధవారం బీఆర్ఎస్ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యానంద్‌ప్రసాద్

ఉపాధిహామీ సామాజిక తనిఖీ పూర్తి

ఆలేరు రూరల్, మే 29 : మండలంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని అధికారులు బుధవారం చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అడిషనల్ పీడీ సురేశ్, అడిషినల్ విజిలెన్స్ అధికారి చండీరాణి పర్యవేక్షణలో సామాజిక తనిఖీ జరిగింది. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ సంవత్సరం మార్చి వరకు రూ.2,20,11,499 అంచనా వ్యయంతో 331 పనులకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. సామగ్రి కోసం రూ.6,39,390లు కేటాయించగా రూ.2,26,50,889 ఖర్చు చేసినట్లు అధికారులు వెల్లడించారు. రూ.17,655 రికవరీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ శ్యామల, ఎంపీడీఓ సత్యానంద్‌ప్రసాద్, ఏపీఓ వెంకటకిషన్‌రావు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలని ధర్నా

తాసీల్దార్ కార్యాయలం ఎదుట ధర్నా చేస్తున్న రైతుకూలీ సంఘం నాయకులు

ఆలేరు రూరల్, మే 29 : రాష్ట్రంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల భిక్షపతి మాట్లాడుతూ వానకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన విత్తనాలు సబ్సిడీపై ప్రభుత్వమే అందించాలని కోరారు. జూన్‌లోపే రుణమాఫీ చేసి కొత్త రుణాలను అందించాలన్నారు. 75 శాతం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేయాలని డిమాండ్ చేశారు. సన్నాలకే కాకుండా దొడ్డు రకానికి కూడా బోనస్ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మామిడాల సోమ య్య, కల్లెపు అడివయ్య, ఇక్కిరి సహదేవ్, అన్‌రెడ్డి బాల్‌రెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

కొత్తగూడెంలో ఘనంగా బొడ్రాయి ఉత్సవాలు

పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, మే 29 : మండలంలోని కొత్తగూడెం గ్రామంలో బుధవారం బొడ్రాయి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సురిగిరెడ్డి మల్లారెడ్డి, నాయకులు గంగుల రాజిరెడ్డి, పున్న జగన్‌మోహన్, జినుకల ప్రభాకర్, ఎండీ రేహాన్, గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, ఎండీ అక్రం, ఎండీ జమీరొద్దీన్, చిల్లర కైలాసం, వెంకటేశం పాల్గొన్నారు.

బీజేపీ రజక సెల్ కన్వీనర్‌గా బాలకిషన్

భువనగిరి అర్బన్, మే 29: భారతీయ జనతా ఓబీసీ మోర్చా రజక సెల్ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన కొత్తపల్లి బాలకిషన్‌ను నియమించారు. ఈ మేరకు సెల్ జిల్లా అధ్యక్షుడు దుర్గాపతి లక్ష్మీనారాయణ బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బాలకిషన్‌కు నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ తన నియామకానికి కృషిచేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు బహూకరణ

ధ్వజ స్తంభానికి పూజలు చేసి పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవితాలక్ష్మీనర్సింహారెడ్డి

మోత్కూరు, మే 29 : మోత్కూరులోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ధ్వజ స్తంభానికి రూ.1.50 లక్షల విలువైన ఇత్తడి తొడుగును దాతలు పల్లెర్ల వెంకన్న కళ్యాణి, దామర సోమేశ్వర్– స్వాతి గుప్తా బహూకరించారు. ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు వేసే పనులను బుధవారం ఆలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాలక్ష్మీనర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దంతూరి కృష్ణ, నర్సిరెడ్డి, పూజారులు సూరిబాబుశర్మ, హరిశర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

- కలెక్టర్ హనుమంతు కె. జండగే

కన్యకా పరమేశ్వరి రైస్‌మిల్లులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు కె. జెండగే

భూదాన్‌పోచంపల్లి, మే 29 : అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జండగే అధికారులను ఆదేశించారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి, శివారెడ్డిగూడెం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. పనునలు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో చర్చించి వసతులు పూర్తి చేయడానికి సహకరించాలని సూచించారు. అనంతరం శివారెడ్డిగూడెం, ఇంద్రియాల, రామలింగంపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలతో పాటు పెద్దరావులపల్లిలోని కన్యకా పరమేశ్వరి రైస్‌మిల్లును సందర్శించారు. మిల్లులో ధాన్యం అన్‌లోడింగ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు పూర్తి కావస్తున్నందున కొనుగోలు కేంద్రాలను త్వరగా మూసివేయాలన్నారు. ఈ నెల 31లోగా జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరగా ధాన్యం దిగుమతి చేసుకొని లారీలను వెంటనే కొనుగోలు కేంద్రానికి పంపాలని, ట్రక్ షీట్లను వెంటనే నమోదు చేయాలని, రైతుల ఖాతాల్లో డబ్బులు త్వరగా జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపీకృష్ణ, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌తో బీఆర్ఎస్ నాయకుడు భానుప్రకాశ్‌గౌడ్

మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన భానుప్రకాశ్‌గౌడ్

రాజాపేట, మే 29 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పాండవుల భానుప్రకాశ్‌గౌడ్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లిలో ఆయన కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శాలువాతో సన్మానించారు.

హనుమాన్ జయంతికి భారీ ఏర్పాట్లు

చౌటుప్పల్, మే 29 : చౌటుప్పల్‌లోని పాటిమీది ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు సూచించారు. బుధవారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, దేవాలయ కమిటీ అధ్యక్షుడు సందగళ్ల నాగరాజు, కార్యదర్శి ఉడుగు రమేశ్, కౌన్సిలర్ సందగల్ల విజయాసతీశ్, తాడూరి పరమేశ్, మొదుగాల రమేశ్, తోర్పునూరి నర్సింహ, బొబ్బిళ్ల రాజేందర్ పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి

చౌటుప్పల్ రూరల్, మే 29 : అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ఆర్‌డీఓకు వినతిపత్రం అందించారు. పట్టణంలో పలు ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అనుమతులు లేకుండానే పాఠశాలలు నిర్వహిస్తూ, ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో ఫీజుల పట్టికను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పబ్బు వంశీ, దిండు భాస్కర్, నరేశ్, కిశోర్, శివసాయి, సాయిగణేశ్ పాల్గొన్నారు.

దివ్యాంగుల చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం

- దివ్యాంగుల సంఘం డివిజన్ కార్యదర్శి ఉపేందర్

చౌటుప్పల్ రూరల్, మే 29 : దివ్యాంగుల చట్టం రూపొందించి ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్నా దానిని అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాతీయ దివ్యాంగుల సంఘం చౌటుప్పల్ డివిజన్ కార్యదర్శి వనం ఉపేందర్ విమర్శించారు. బుధవారం పట్టణంలో నిర్వహించిన సంఘం డివిజన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 21 రకాల వైకల్యాలు గల వారికి ధ్రువపత్రాలు జారీ చేయాలని కోరారు. సమావేశంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు తుంగ భూపాల్‌రెడ్డి, నాయకులు ఏర్పుల శివయ్య, బలుగూరి అంజయ్య, సంజీవ శంకర్, బర్ల పార్వతి పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు చోరీకి యత్నించిన వ్యక్తుల పట్టివేత

భువనగిరి అర్బన్, మే 29: విద్యుత్ తీగలను చోరీ చేసేందుకు యత్నిస్తున్న వ్యక్తులను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించిన ఘటన భువనగిరి పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీవద్ద కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు కిందికి వేలాడుతున్నాయి. ఆ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలిస్తుండగా గమనించిన స్థానికులు నిలదీశారు. దాంతో వారు పారిపోయేందుకు ప్రయత్నించగా స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పట్టణ ఎస్ఐ వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

- మండల ప్రత్యేకాధికారి రాజారాం

మైలారం ప్రభుత్వ పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నోడల్ అధికారి రోజారాణి

ఆత్మకూరు(ఎం), మే29 : అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కమిటీల చైర్‌పర్సన్లు ప్రతి రోజు పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించిన యూనిఫాంను కుట్టించి పంపిణీ కోసం సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో ఎంపీడీఓ నిరంజన్‌వలి, ఏఈ ధనలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన నోడల్ అధికారి

బొమ్మలరామారం : ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల నోడల్ అధికారి రోజారాణి సూచించారు. మండలంలోని మైలారం ప్రాథమిక పాఠశాల, నాగినేనిపల్లి జడ్పీహైస్కూల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేయించాలని సూచించారు. ఆమె వెంట ఉపాధ్యాయులు శ్రీలత, సీవీ శ్రీనివాస్, సీఆర్పీ శ్రీహరి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి ఉన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

యాదగిరిగుట్ట, మే 29 : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని సైదాపురంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 86 మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ చల్లా జయశ్రీ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీనరసింహారెడ్డి, వైస్ చైర్మన్ రెడ్డి బాలాజీ, డివిజన్ అధ్యక్షుడు సద్ది వెంకటరెడ్డి, డైరెక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, హమీద్, ఎస్ఎన్ చారి, రామిరెడ్డి, ఏఎన్ఎం డిపోలమ్మ, ఆశ వర్కర్ సుమతి, ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సైదాపురం గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా మూలపాటి వెంకటేశ్, వైస్ చైర్మన్‌గా గుండ నరసింహ, కోశాధికారిగా సారాజి లక్ష్మయ్య, డైరెక్టర్లుగా పల్లె నరేందర్, మానుపాటి కృష్ణయ్య, బాలరాజు, భరత్‌కుమార్ గౌడ్, రామనర్సయ్య, మల్లేశ్, భాగ్యమ్మ, సుమతి ఎన్నికయ్యారు.

కుటుంబ తగాదాలతో యువకుడి ఆత్మహత్య

భువనగిరి అర్బన్, మే 29 : కుటుంబ తగాదాలతో మనస్తాపం చెంది యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట మండలం చొల్లేరు గ్రామానికి చెందిన దొంతిసారం శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి భువనగిరి పట్టణంలోని ఆజాద్‌రోడ్‌లో నివాసముంటున్నాడు. చొల్లేరులో బోనాలు నిర్వహించడంతో ఈ నెల 25, 26 తేదీల్లో గ్రామానికి వెళ్లాడు. గతేడాది శంకర్ అన్నదమ్ములు కలిసి బోనాల పండగను జరుపుకోగా ఈ సంవత్సరం శంకర్ కుటుంబాన్ని వదిలి మిగతా సోదరులు పండగను జరుపుకొన్నారు. ఈ క్రమంలో శంకర్ తన కుటుంబ సభ్యులను వదిలి అన్నదమ్ములతో కలిసి పండుగలో పాల్గొన్నాడు. ఈ విషయమై శంకర్‌తో భార్య, కుమారుడు నితిన్(19), కుమార్తె గొడవ పెట్టుకున్నారు. పండగ జరిగిన వెంటనే వారంతా భువనగిరికి వెళ్లారు. ఈ విషయమై బుధవారం మరోసారి కుటుంబ సభ్యుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దాంతో మనస్థాపానికి గురైన శంకర్ కుమారుడు నితిన్ పట్టణ పరిధిలోని క్వారీ గుంతలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.

ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ నాగరాజు తెలిపారు.

రైతులతో మాట్లాడుతున్న అదనపు జిల్లా కలెక్టర్ బెన్ షాలోమ్

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

భూదాన్‌పోచంపల్లి, మే29 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు జిల్లా కలెక్టర్ బెన్ షాలోమ్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం మండలంలోని గౌస్‌కొండ, భీమనపల్లి, దంతూరు గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలు, హమాలీల కొరత, రవాణా సమస్య, ధాన్యం దిగుమతి, కొనుగోళ్లలో జాప్యం వంటి విషయాలపై పీఏసీఎస్ సీఈఓ బాల్‌రెడ్డితో పాటు రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన ధాన్యం కాంటా వేయకుండా రైతులను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. రెండు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ధాన్యం దిగుమతులు త్వరగా చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో రూ.524 కోట్ల విలువైన 2.39 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. లారీల కొరత లేకుండా త్వరగా దిగమతి అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అకాల వర్షాలతో ధాన్యం తడువకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

మాజీ ఎంపీటీసీ జనార్దన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మాజీ ఎంపీటీసీకి మాజీ ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

అడ్డగూడూరు, మే 29: మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు పూలపల్లి జనార్దన్‌రెడ్డి ఇటీవల కంటి చికిత్స చేసుకొని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ బుధవారం ఆయనను పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ దర్శనాల అంజయ్య, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ పొన్నాల వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగులపల్లి దేవగిరి, నాయకులు పోలేపాక అబ్బయ్య, బాలెంల బాబూమహాజన్, గూడెపు పరమేశ్, బాలెంల అరవింద్ ఉన్నారు.

కొండమడుగు మహిళాశక్తి కేంద్రంలో యూనిఫాంను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ కృష్ణన్

మహిళాశక్తి కేంద్రాల పరిశీలన

బీబీనగర్, మే 29 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే యూనిఫామ్‌లను మహిళా శక్తి కేంద్రాల్లో మహిళా సంఘాల సభ్యులు కుడుతున్నారు. మండలంలోని కొండమడుగు, జియాపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న కేంద్రాలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కృష్ణన్ సందర్శించారు. యూనిఫాం తయారీని పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న మహిళలకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఎం శ్రీనివాస్, సీసీ మల్లేశ్, మహిళా శక్తి కేంద్రం సభ్యులు ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

వలిగొండ, మే 29: మండలంలోని టేకులసోమారం గ్రామ సమీపంలో బుధవారం బైక్‌ను లారీ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన మాలోతు బిచ్చ బైక్‌పై వలిగొండ మండలంలోని పొద్దటూర్ గ్రామానికి వచ్చి తాటి ముంజలు తీసుకొని తిరుగు ప్రయాణమయ్యాడు. టేకులసోమారం గ్రామ చౌరస్తా వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీ ఢీ కొనడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 వాహనంలో భువనగిరి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం మెదక్ జిల్లా సంగారెడ్డిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బిచ్చ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్ఐ మహేందర్‌లాల్ తెలిపారు.

పత్తి విత్తన దందా

- రైతు కోరిన ప్యాకెట్ రూ.1300 నుంచి రూ.1500 వరకు అమ్మకం
- లేదంటే పది ఇతర ప్యాకెట్లు కొంటే ఒక డిమాండ్ కంపెనీ ప్యాకెట్ విక్రయం
- నల్లగొండలో బ్లాక్ చేసి విక్రయిస్తున్న ముగ్గురు వ్యాపారులు
- జిల్లాలో కృత్రిమ కొరత సృష్టించి విక్రయిస్తున్నారంటున్న రైతులు



నల్లగొండ, మే 29 : నల్లగొండలోని ప్రకాశం బజార్ కూరగాయల మార్కెట్‌లో ఉన్న ఒక ఫర్టిలైజర్ దుకాణంలో ఈ నెల 24న కట్టంగూర్ మండలం పరడకు చెందిన రైతు రాంరెడ్డి(పేరు మార్చాం) అమెరికా కంపెనీకి చెందిన పది విత్తన ప్యాకెట్లు కావాలని అడిగాడు. దుకాణ యజమాని లేవనడంతో వ్యవసాయ అధికారిని సంప్రదించినా ఉపయోగం లేకుండాపోవడంతో వెనుతిరిగి వెళ్లిపోయాడు.

–అదే రోజు సాయంత్రం తిప్పర్తికి చెందిన ఒక రైతు అవే విత్తన ప్యాకెట్లు కావాలని అడగ్గా.. పది ప్యాకెట్లు వేరే కంపెనీవి కొంటే అమెరికా కంపెనీ ప్యాకెట్ ఇస్తానని అనడంతో ఇరవై ప్యాకెట్లు వేరే కంపెనీ ప్యాకెట్లు కొని సదరు కంపెనీ ప్యాకెట్లు తీసుకొని వెళ్లాడు.

–నల్లగొండ మండలం గుండ్లపల్లికి చెందిన లక్ష్మయ్య అనే రైతు తొమ్మిది ప్యాకెట్లు అమెరికా కంపెనీ పత్తి ప్యాకెట్లు కావాలని అడగ్గా ప్యాకెట్‌కు రూ.1300 తీసుకొని ప్రకాశం బజార్‌లోని పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న సదరు కంపనీ డీలర్ అమ్మాడు.. అలాగే ఇతర జిల్లాల నుంచి తెచ్చి న్యూప్రేమ్ థియేటర్ సమీపంలో మరో వ్యాపారి ఒక్కో ప్యాకెట్ రూ.1300 నుంచి రూ.1400 వరకు అమ్ముతున్నాడని రైతులు అంటున్నారు.

ఇలా అమెరికాకు చెందిన ఒక పత్తి విత్తన కంపెనీకి సంబంధించిన ప్యాకెట్లు నల్లగొండలో విచ్చలవిడిగా బ్లాక్‌కు తరలిస్తూ విక్రయిస్తున్నారు. ప్రభుత్వం బీజీ–2 విత్తనాలు రూ.864కి మాత్రమే అమ్మాలని నిబంధన పెడితే వాటిని పట్టించుకోకుండా వ్యాపారులు స్థానిక అధికారులను తప్పుదోవ పట్టించి డిమాండ్ ఉన్న విత్తన ప్యాకెట్లను బ్లాక్‌కు తరలిస్తూ విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా జిల్లాలో ఈ సారి 5.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయనుండగా ఆయా కంపెనీలు 8 లక్షల నుంచి 10 లక్షల వరకు మాత్రమే సప్లై చేస్తున్నాయి. దాంతో వ్యాపారులు డిమాండ్ ఉన్న ప్యాకెట్లు బ్లాక్‌లో విక్రయిస్తుండగా, డిమాండ్ లేని కంపెనీలను రైతులకు అంటగడుతున్నారు. దాంతో దిగుబడి సరిగ్గా రాక రైతులు నష్టపోతున్నారు.

ఆ ముగ్గురు కుమ్మక్కై విక్రయం

అమెరికా కంపెనీకి చెందిన పత్తి విత్తన ప్యాకెట్లను ముగ్గురు వ్యాపారులు కుమ్మక్కై బ్లాక్‌లో అమ్మి రైతులను నిండా ముంచుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో సదరు కంపెనీకి చెందిన డీలర్లు పది మంది ఉన్నప్పటికీ నల్లగొండలోని ప్రకాశం బజార్‌లో ఉన్న డీలర్‌కే కంపెనీ ప్రతినిధులు ఎక్కువ స్టాక్ ఇవ్వడంతో ఆయన పెద్దఎత్తున విత్తన ప్యాకెట్లు బ్లాక్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. ఆయన బాటలోనే పెట్రోల్ బంక్ వద్ద ఉన్న డీలర్‌తోపాటు ఓల్డ్ సిటీలో ఉన్న మరో డీలర్ ఇతర జిల్లాల నుంచి కొనుగోలు చేసి ఇక్కడ ప్యాకెట్‌ను రూ.1300 పైగా విక్రయిస్తున్నట్లు రైతులు అంటున్నారు. అధికారులకు అందిన ఫిర్యాదుల మేరకు ఆయా దుకాణాల్లో తనిఖీలు చేసినప్పటికీ ఆ ప్యాకెట్ల స్టాక్ అయిపోయిందనే సమాధానం వచ్చిందట. ఇదిలా ఉండగా తక్కువ సరుకు వచ్చిందని, అప్పుడే అమ్మేశామని కొందరి రైతుల వివరాలు ఇచ్చి బ్లాక్‌లో అమ్మే వాళ్లకు కొంత సమయమిచ్చి వేరే దగ్గర నుంచి తెప్పించి ఇస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

డిమాండ్ తగ్గ సప్లై లేని విత్తనాలు

జిల్లాలో ఈ ఏడాది వానకాలం సీజన్‌లో 11,18,512 ఎకరాల్లో ఆయా పంటలు సాగు చేస్తారనే వ్యవసాయ శాఖ అంచనాలు ఉండగా అందులో 5,40,081 ఎకరాల్లో పత్తి, 5,19,160 ఎకరాల్లో వరి, మిగిలిన ఎకరాల్లో ఇతర పంటలు ఉండనున్నాయి. 5.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయడానికి కనీసం 16 లక్షల నుంచి 18 లక్షల వరకు విత్తన ప్యాకెట్లు అవసరం పడతాయి. జిల్లాలో ప్రతియేటా రైతులు ఆంధ్రాతోపాటు మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్‌కు వెళ్లి విత్తనాలు తీసుకొస్తుంటారు. అలా కొనుగోళ్లు జరిగినప్పటికీ డిమాండ్ ఉన్న విత్తనాల కోసం వ్యాపారులు బ్లాక్‌కు తెర తీస్తున్నారు. ఇక రెగ్యులర్‌గా సప్లై చేసే కంపెనీ విత్తన ప్యాకెట్లు పోను మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన కంపెనీల విత్తన ప్యాకెట్లు, డిమాండ్ ఉన్న విత్తన ప్యాకెట్లకు లింక్ పెట్టి ఆయా చిన్న కంపెనీల నుంచి భారీగా డిస్కౌంట్లు, ఇతర దేశాల టూర్లు, ప్రత్యేక ప్యాకేజీలు పొందుతుండటం గమనార్హం.